క్లుప్తంగా...

హైటెన్షన్ తీగల మార్పునకు కృషి



స్థానికులతో మాట్లాడుతున్న శ్రీలత శోభన్‌రెడ్డి

లాలాపేట: తార్నాక స్ట్రీట్ నెంబర్ 10, 11 జన వాసాల్లో ఉన్న విద్యుత్ హై టెన్షన్ వైర్లను శుక్రవారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత శోభన్‌రెడ్డి పరిశీలించారు. ఇళ్లపై నుంచి వెళ్తున్న 33కేవీ తీగలతో తలెత్తుతున్న సమస్యలపై స్థానికులు డిప్యూటీ మేయర్‌కు దృష్టికి తీసుకెళ్లగా విద్యుత్ అధికారులతో చర్చించి హై టెన్షన్ వైర్ల మార్పుపై చర్చించారు. ఈ సమస్యను మంత్రి జగదీశ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేలా కృషి చేస్తామని డిప్యూటీ మేయర్ హామీ ఇచ్చారు.

నేడు ఉద్యోగమేళా

సనత్‌నగర్: డాన్‌బాస్కో అనుబంధ సంస్థ దిశ ఆధ్వర్యంలో శనివారం జాబ్‌డ్రైవ్ నిర్వహించనున్నట్లు ఆ సంస్థ కో–ఆర్డినేటర్లు ఐవాన్‌వాజ్, స్టీఫెన్ ఓ ప్రకటనలో తెలిపారు. సోమాజీగూడ రాజ్‌భవన్ రోడ్డులోని లేక్ షోర్ టవర్స్ 3, 4 అంతస్తుల్లో ఉదయం 10 నుంచి జాబ్‌డ్రైవ్ జరుగుతుందని పదో తరగతి నుంచి గ్రాడ్యుయేషన్, ఐటీఐ, డిప్లొమా విద్యార్హత కలిగిన వారు ఇంటర్వ్యూలకు హాజరు కావొచ్చన్నారు.

ఓయూను సందర్శించిన థాయ్‌లాండ్ వర్సిటీ బృందం

ఉస్మానియా యూనివర్సిటీ: థాయ్‌లాండ్‌లోని ఉబాన్ రట్చతని ప్రభుత్వ యూనివర్సిటీకి (యూబీయూ) చెందిన 12 మంది ప్రతినిధుల బృందం శుక్రవారం ఓయూను సందర్శించారు. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మీనారాయణ, ఇతర అధికారులతో సమావేశమైన ఓయూలో కొనసాగుతున్న కోర్సుల వివరాలు, పాలన తీరు, పరిశోధనలు, విధి విధానాలు, విదేశీ విద్యార్థుల సౌకర్యాలు తదితర అంశాలను అడిగి తెలుసుకున్నారు. వివిధ అంశాలలో రెండు వర్సిటీలు కలిసి పని చేసేందుకు యూబీయూ అధ్యక్షులు డాక్టర్ చుతినమ్ ప్రసిత్ అంగీకరించినట్లు ఓయూ అధికారులు పేర్కొన్నారు. ప్రొ.శ్రీరామ్ వెంకటేష్, సీడీఈ డైరెక్టర్ ప్రొ.జీబీ రెడ్డి, సైన్స్ డీన్ ప్రొ.కురుణసాగర్, ఫారెన్ రిలేషన్ డైరెక్టర్ ప్రొ.శివరామకృష్ణ పాల్గొన్నారు.

యూఎంఎస్ ఆధునీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అనుబంధ కాలేజీల ఆన్‌లైన్ గుర్తింపు కొనసాగుతున్న యూఎంఎస్ విధానాన్ని ఆధునీకరించారు. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ లక్ష్మీనారాయణలు ఆన్‌లైన్ అఫిలియేషన్ ప్రక్రియను ప్రారంభించి మాట్లాడారు. ఈ ప్రక్రియ ద్వారా సులువుగా అనుబంధ కాలేజీ గుర్తింపు వ్యక్తుల ప్రమేయం లేకుండా పూర్తవుతుందన్నారు.

కాంట్రాక్టర్లకు బిల్లులు సకాలంలో చెల్లించాలి

లాలాపేట: చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లించేలా జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని సికింద్రాబాద్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జి.ఆనంద్‌కుమార్, ప్రధాన కార్యదర్శి పి. విజయ్‌కుమార్ శుక్రవారం జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సికింద్రాబాద్ డివిజన్‌లో డీఏఓ అధికారులు, సిబ్బంది కార్యాలయంలో అందుబాటులో ఉండటం లేదన్నారు. సమయపాలన లేకుండా కార్యాలయానికి వస్తున్న అధికారులు, సిబ్బంది వర్క్ బిల్లులు పూర్తి చేయడంలో అలసత్వం వహిస్తుండటంతో బిల్లులు సకాలంలో అందక తీవ్ర ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు దృష్టి సారించి డీఏఓ అధికారులు, సిబ్బంది కార్యాలయ సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలనీ కోరుతున్నారు.

డీసీఎం ఢీకొని వ్యక్తి మృతి

లాలాపేట: అతివేగంగా దూసుకొచ్చిన డీసీఎం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి గాయాలైన ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై భార్గవి వివరాల ప్రకారం.. వెంకటేశ్వర్లు, పూజారి కోటేశ్వర శర్మ ఇద్దరు శుక్రవారం ఉదయం మేడిపల్లి నుంచి చిక్కడపల్లికి ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా హబ్సిగూడ క్రాస్ రోడ్డు వద్ద వేగంగా దూసుకొచ్చిన డీసీఎం ఢీకొట్టడంతో ఇద్దరూ ఎగిరి కింద పడగా వెనకాల కూర్చున్న వెంకటేశ్వర్లు (61) అక్కడికక్కడే మృతి చెందగా కోటేశ్వరశర్మ తీవ్రంగా గాయపడ్డాడు. డీసీఎం డ్రైవర్ షర్ఫుద్దీన్‌ను అరెస్టు చేశారు.

మహిళను మోసం చేసిన వ్యక్తి రిమాండ్

కంటోన్మెంట్: ఓ మహిళతో పరిచయం పెంచుకుని పెళ్లి చేసుకుంటానని మోసం చేసిన వ్యక్తిని బోయిన్‌పల్లి పోలీసులు రిమాండ్‌కు తరలించారు. పోలీసుల వివరాల ప్రకారం.. జహీరాబాద్‌కు చెందిన బాధిత మహిళ సుచిత్ర సమీపంలోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. కామన్ ఫ్రెండ్ ద్వారా ఆమెకు ఫేస్‌బుక్‌లో అల్వాల్‌కు చెందిన మహేంద్రాచారితో పరిచయం ఏర్పడింది. వీరిద్దరి మధ్య సాన్నిహిత్యం పెరగడంతో ఒక్కటయ్యారు. బాధిత మహిళకు గతంలోనే వివాహం జరిగినప్పటికీ భర్త నుంచి విడిపోయినట్లుగా చెబుతోంది. సదరు మహిళను తాను వివాహం చేసుకుంటానని చెప్పి మహేంద్రాచారి ఇటీవల మరో అమ్మాయి పెళ్లి చేసుకుంటున్నాడని తెలిసి బోయిన్‌పల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా మహేంద్రాచారిని రిమాండ్‌కు తరలించారు.

కంటోన్మెంట్ బీఆర్‌ఎస్‌లో వర్గపోరు!

బోర్డు మాజీ సభ్యులకు ఝలక్!

- జనసమీకరణలో పరిగణనలోకి తీసుకోని వైనం
- భగ్గుమంటున్న సభ్యులు



పార్టీ కార్యకర్తలతో లాస్య నందిత సమావేశం

కంటోన్మెంట్: కంటోన్మెంట్ బీఆర్‌ఎస్‌లో వర్గపోరు పెరిగిపోతోంది. పార్టీ అభ్యర్థి ప్రకటనతో అంతా సమిసిపోతుందని భావించినా పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. ముందు నుంచే వేర్వేరు గ్రూపులుగా విడిపోయిన పార్టీ నేతలను సమన్వయం చేసుకుని ముందుకు సాగడంలో పార్టీ అభ్యర్థి లాస్య నందిత వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోంది. గత నెల 21న తనను పార్టీ అభ్యర్థిగా ప్రకటించిన తర్వాత తొలిసారిగా ఆమె ఆధ్వర్యంలో కొల్లాపూర్ బహిరంగ సభకు జనసమీకరణ బాధ్యతను అప్పగించారు. ఈ మేరకు నియోజకవర్గ వ్యాప్తంగా ముఖ్య నేతలు, కార్యకర్తలు సమాయాత్తం చేయాల్సిన పార్టీ అభ్యర్థి కీలక నేతలకే సమాచారం ఇవ్వలేదని తెలుస్తోంది. కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులకు కొల్లాపూర్ సభకు సంబంధించిన ఆహ్వానమే లేకపోవడం గమనార్హం. ఇక స్థానిక బీఆర్‌ఎస్ టికెట్ ఆశించి భంగపడిన కార్పొరేషన్ చైర్మన్‌లు గజ్జెల నాగేశ్, క్రిశాంక్, ఎర్రోళ్ల శ్రీనివాస్ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఆది నుంచీ సాయన్న వర్గం ఈ నేతలను దూరం పెడుతూనే ఉంది.

అధిష్టానం దృష్టికి?

దివంగత ఎమ్మెల్యే సాయన్న కంటోన్మెంట్ నుంచి ఐదుసార్లూ వ్యక్తిగత ఇమేజ్, పార్టీ బలంతోనే గెలుస్తూ వచ్చారు. ఆయన ప్రధాన అనుచరగణంలో ప్రజాబలం కలిగిన నేతలు ఒకరిద్దరు మాత్రమే ఉన్నారు. అయినప్పటికీ అంతా తామే అన్నట్లుగా వ్యవహరిస్తున్న తీరు నేడు చర్చనీయాంశం అవుతోంది. సాయన్న కుమార్తె లాస్య నందితను అధినేత కేసీఆర్ పార్టీ అభ్యర్థిగా ప్రకటించడంతో సాయన్న వర్గం మరోసారి తమ ఆధిపత్యాన్ని ప్రదర్శించేందుకు యత్నిస్తోంది. ఈ విషయంలో నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్ రెడ్డితో పాటు కంటోన్మెంట్ బోర్డు మాజీ సభ్యులను సైతం పక్కన పెడుతూ ఉండటం గమనార్హం. ఈ నేపథ్యంలోనే కొల్లాపూర్ సభకు జనసమీకరణకు సంబంధించి లాస్య నందిత నివాసంలో రెండు రోజులుగా పార్టీ ముఖ్య నేతల సమావేశం నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ సభ్యులు పాండుయాదవ్, అనిత ప్రభాకర్, లోకనాథం, నళిని కిరణ్, శ్యామ్ కుమార్‌కు సమాచారమే ఇవ్వడం లేదని తెలుస్తోంది. దీన్ని సీరియస్‌గా పరిగణిస్తున్న బోర్డు మాజీ సభ్యులు ఇక అధిష్టానం వద్దే తేల్చుకుంటామని చెబుతుండటం కొసమెరుపు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి

మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్



బస్తీవాసులతో మాట్లాడుతున్న మంత్రి తలసాని

రాంగోపాల్‌పేట్: ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నామని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. శుక్రవారం రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని కాచిబోలిలో వివిధ శాఖల అధికారులతో కలిసి ఆయన పర్యటించి స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బస్తీ ప్రజలు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరగా 3 రోజుల్లో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే సీవరేజ్, రోడ్డు పనుల గురించి ప్రస్తావించగా త్వరలోనే వాటిని కూడా పరిష్కరిస్తామన్నారు. బస్తీ వాసుల సౌకర్యార్థం రూ.60లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మిస్తుస్తామని త్వరలోనే పనులు ప్రారంభిస్తామని మంత్రి వెల్లడించారు. గతేడాది వర్షం నీరు బస్తీలోకి వచ్చి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొనే వారని కానీ పూడికతీతతో పాటు నాలా అభివృద్ధి చేయడంతో వరద ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపామన్నారు. మంత్రి వెంట మాజీ కార్పొరేటర్లు అరుణగౌడ్, కిరణ్మయి, ఈఈ సుదర్శన్, జలమండలి సీజీఎం ప్రభు ఉన్నారు.

గణేష్ ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు ..

సనత్‌నగర్: గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేలా ప్రభుత్వం అన్ని ఏర్పాట్లను చేస్తుందని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ తెలిపారు. వెస్ట్‌మారేడ్‌పల్లిలోని తన నివాసం వద్ద సికింద్రాబాద్‌లోని గణేష్ టెంపుల్, జీహెచ్‌ఎంసీల ఆధ్వర్యంలో శుక్రవారం మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని పిలుపునిచ్చారు.మట్టి విగ్రహాలను ప్రతిష్ఠించే విధంగా ప్రజలను ప్రోత్సహించే లక్ష్యంతో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డుల ఆధ్వర్యంలో 4.64 లక్షల మట్టి విగ్రహాలను జీహెచ్‌ఎంసీ పరిధిలో పంపిణీ చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గణేష్ టెంపుల్ చైర్మన్ సత్యనారాయణ, మాజీ చైర్మన్ జయరాజ్, సభ్యులు హన్మంతరావు, శానిటేషన్ డీఈ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే ఉజ్వల భవిష్యత్



మాట్లాడుతున్న మనోహర్

సనత్‌నగర్: ఉజ్వల భవిష్యత్ నిర్మాణం కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సనత్‌నగర్ నియోజకవర్గ ఏఐసీసీ పర్యవేక్షకులు, తమిళనాడు ఎమ్మెల్యే రూబీ మనోహరన్ అన్నారు. సనత్‌నగర్ సెయింట్ థెరిస్సా హాస్పిటల్‌లో ఉద్యోగులు, వైద్య సిబ్బంది, నర్సులతో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోట నీలిమా ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. దేశంలో మోదీ, రాష్ట్రంలో కేసీఆర్ ప్రభుత్వం నియంతృత్వ పాలన సాగిస్తుందన్నారు. బీజేపీ, బీఆర్‌ఎస్ పార్టీలు రహస్య ఒప్పందంతోనే పనిచేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తెలంగాణ మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఐవాన్‌వాజ్, నాయకులు థామసమ్మ, అబ్బాస్, షరీఫ్, ఇబ్రహీం పటేల్ పాల్గొన్నారు.

'విజయభేరి'ని జయప్రదం చేయండి..

సనత్‌నగర్: కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఈ నెల 17న తుక్కుగూడలో జరిగే విజయభేరి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ సీనియర్ నేత డాక్టర్ రవీందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. చలో విజయభేరి నేపథ్యంలో సనత్‌నగర్ నియోజకవర్గానికి సంబంధించి శుక్రవారం నిర్వహించిన సన్నాహక కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి రోజురోజుకు ఆదరణ పెరుగుతోందన్నారు. ప్రజలు కాంగ్రెస్ పార్టీ వైపు చూస్తున్నారని ఆ పార్టీ అధికారంతోనే అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తోట మణిమాల, రమేష్, కమల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

వార్డు కార్యాలయాల ద్వారా మట్టి విగ్రహాల పంపిణీ

బన్సీలాల్‌పేట్: జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయాల ద్వారా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్నట్లు బేగంపేట్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఎన్. శంకర్ సూచించారు. శుక్రవారం తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా ఉచితంగా వార్డు కార్యాలయాల ద్వారా గణేష్ మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నామన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రజలు మట్టి వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించాలని కోరారు. బన్సీలాల్‌పేట్, రాంగోపాల్‌పేట్, బేగంపేట్, మోండా డివిజన్ల వార్డు కార్యాలయాల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. స్థానిక ప్రజాప్రతినిధులను ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేస్తున్నామన్నారు.

విజేతలకు అభినందనలు

రాంగోపాల్‌పేట్: ఇటీవల ఎల్బీ స్టేడియంలో 67వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్ స్కూల్ జిల్లాస్థాయి వాలీబాల్ పోటీల్లో విజయం సాధించిన సుభాష్‌రోడ్‌లోని సెయింట్ ఆంథోనీ బాలికల పాఠశాల టీమ్‌కు అభినందనలు తెలిపారు. సికింద్రాబాద్‌లోని పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సుజాత, పీఈటీ ఆరోగ్య మేరి, కోచ్ కృష్ణ, కెప్టెన్ భవానీలో పాల్గొని అభినందించారు.

నేడు మట్టి విగ్రహాల పంపిణీ

చిలకలగూడ: సీతాఫల్‌మండి డివిజన్ చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయ ప్రాంగణంలో నేడు ఉదయం 9 గంటలకు జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేయనున్నట్లు కార్పొరేటర్ సామల హేమ తెలిపారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టే తేదీని ప్రకటించాలి

మంద కృష్ణమాదిగ



మహాధర్నాలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

బౌద్ధనగర్: ప్రత్యేకంగా నిర్వహిస్తున్న పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఎప్పుడు పెడతారో తేదీని ప్రకటించాలని ఎమ్మార్పీఎస్ అధినేత మంద కృష్ణమాదిగ డిమాండ్ చేశారు. శుక్రవారం పార్సీగుట్ట చౌరస్తాలో జరిగిన మహాధర్నా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మూడు దశాబ్దాలుగా మాదిగలు అలుపెరగకుండా చేస్తున్న పోరాటాలు, ఆవేదనను బీజేపీ, కాంగ్రెస్‌లు అర్థం చేసుకోవాలన్నారు. బీజేపి ప్రభుత్వం ఈ పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లోనే ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించి తమ చిత్తశుద్ధిని చాటాలన్నారు. కాంగ్రెస్ పార్టీ చేవెళ్లలో ప్రకటించిన డిక్లరేషన్‌కు కట్టుబడి సీడబ్ల్యూసీ సమావేశంలో ఎస్సీ వర్గీకరణపై తీర్మాణనం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకునేందుకు గల్లీ నుంచి ఢిల్లీ వరకు పోరాటాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ నెల 18 నుంచి మాదిగ ఉద్యోగులు, మేధావుల ఆధ్వర్యంలో చలో ఢిల్లీ కార్యక్రమాలను చేపడుతున్నట్లు ప్రకటించారు. ఉపేందర్, గోవిందు నరేష్ మాదిగ, నర్సయ్య, షణ్ముఖరావు,లత, మంగమ్మ, సోమశేఖర్, మల్లికార్జున్ పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంలో జాప్యం.. జనాగ్రహం



సికింద్రాబాద్: పాలకుల జోక్యం, అధికారుల నిర్లక్ష్యంతో రహదారులు ప్రమాదకరంగా మారుతున్నాయి. ప్రభుత్వం నుంచి నిధుల కేటాయింపులు, టెండర్ల ప్రక్రియ పూర్తయినా కేవలం ఆయా ప్రాంతాల్లో నివాసముంటున్న అధికార పార్టీ నాయకుల స్వప్రయోజనాల కోసం నిర్మాణం పనులు వాయిదా వేస్తూ వస్తున్నారు. సీతాఫల్‌మండి డివిజన్ జలమండలి కార్యాలయం మీదుగా టీఆర్‌టీ క్వార్టర్స్ తదితర ప్రాంతాలకు వెళ్లే రహదారి నిర్మాణం కోసం కొద్ది నెలల క్రితమే రూ.50 లక్షల నిధులు మంజూరు చేశారు. అదే ప్రాంతంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్న గుత్తేదారు వాహనాల కోసం కొన్ని నెలలు, ఇంకొందరు నాయకుల జన్మదిన వేడుకల కోసం మరికొన్ని నెలలు రోడ్డు నిర్మాణం పనులు వాయిదా వేస్తూ వచ్చారు. తీరా నెల రోజుల క్రితం నిర్మాణం కోసం రహదారిని మొత్తంగా తవ్వేశారు. డ్రైనేజీ, తాగునీటి లైన్ల నిర్మాణం కోసం కొన్ని రోజులు గడిచిపోయాయి. తీరా రోడ్డు నిర్మాణం పనులు చేపట్టేందుకు ఇదే ప్రాంతంలో ఉండే ఓ నాయకుడి వేడుకల కోసం మరోవారం వాయిదా వేశారు. తిరిగి మళ్లీ నిర్మాణం పనులు చేపట్టే సమయానికి ఇదే కాలనీకి పెద్దలుగా ఉంటున్న ఇరువురు నాయకులు నిర్వహించే గణపతి నవరాత్రి వేడుకల నిమిత్తం రోడ్డు నిర్మాణం పనులు వాయిదా వేస్తున్నట్టు స్థానికులు ఫిర్యాదు చేస్తున్నారు. టీఆర్‌టీ ప్రాంతంలో నివసించే ఇద్దరు ముగ్గురు నాయకుల స్వప్రయోజనాల కోసమే ప్రభుత్వ అభివృద్ధి పనులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని పలువురు టీఆర్‌టీ ప్రాంత వాసులు శుక్రవారం ఎమ్మెల్యే కార్యాలయానికి వచ్చి నిరసన వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే పేరు చెప్పుకుని ఈ ప్రాంతంలోని కొందరు పెద్దలు వేడుకల పేరుతో పెత్తనం నిర్వహించి తమను ఇబ్బందుల పాలు చేయడం ఏంటని ఎమ్మెల్యే కార్యాలయ అధికారులను ప్రశ్నించారు. ప్రమాదకరంగా మారిన టీఆర్‌టీ ప్రాంత రహదారులను సత్వరమే నిర్మించాలని కోరారు.

అభివృద్ధి ఎజెండా లక్ష్యంగా ఎఫ్‌డీజీపీ ఆవిర్భావం



ఎఫ్‌డీజీపీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న అతిథులు

సనత్‌నగర్: శాంతి, శ్రేయస్సు, అభివృద్ధి ఎజెండాతో ఫోరమ్ ఫర్ డెమొక్రసీ అండ్ గ్లోబల్ పీస్ (ఎఫ్‌డీజీపీ) ముందుకు రావడం శుభపరిణామమని సుప్రీం కోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అన్నారు. బేగంపేటలోని సెంటర్ ఫర్ ఎకనామిక్స్ అండ్ సోషల్ స్టడీస్ వేదికగా శుక్రవారం ఎఫ్‌డీజీపీ ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ప్రస్తుత తరుణంలో రాజకీయ పార్టీల వ్యవహార శైలితో ప్రమాదంలో పడుతున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయన్నారు. కొన్ని దేశాల మధ్య వైరితో ప్రపంచ దేశాల మధ్య ఉన్న మైత్రికి భంగం వాటిల్లే ప్రమాదం ఉందని, ఈ క్రమంలో ప్రపంచ శాంతిని నెలకొల్పే దిశగా తనవంతు ప్రయత్నంతో ఫోరం ఫర్ డెమొక్రసీ అండ్ గ్లోబల్ పీస్ ముందుకురావడం అభినందనీయమన్నారు. న్యాయపరం, సామరస్యపూర్వకంగా ప్రపంచ సవాళ్లను అధిగమించే దిశగా పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు ఈ సంస్థ ముందడుగు వేయగలదన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మాజీ ప్రత్యేక చీఫ్ సెక్రటరీ గోపాలకృష్ణ, సామాజికవేత్త ప్రొఫెసర్ రామ మెల్‌కోటే, మాజీ ఎమ్మెల్సీ కానుకుల జనార్దన్‌రెడ్డి, ఫోరం అధ్యక్షుడు శ్యాంమోహన్ అనంతుల, ఉపాధ్యక్షుడు కమలాకర్ రావు, గౌరవ కార్యదర్శి శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

సమాజాభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకం



నివాళులర్పిస్తున్న ఉన్నతాధికారులు

సికింద్రాబాద్: నవ సమాజ అభివృద్ధిలో ఇంజినీర్ల పాత్ర కీలకమని పలువురు రైల్వే ఉన్నత అధికారులు పేర్కొన్నారు. గడచిన దశాబ్దకాలంగా ఇంజినీర్ల కృషి ఫలితంగానే దేశం పురోభివృద్ధి సాధించిందని కొనియాడారు. శుక్రవారం నార్త్‌లాలాగూడలోని జోనల్ ఇంజినీర్ల శిక్షణ కేంద్రం ఆడిటోరియంలో నిర్వహించిన మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతి వేడుకల్లో రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఇంజినీర్ రామకృష్ణ, ఎలక్ట్రికల్ చీఫ్ ఇంజినీర్ పీడీ మిశ్రా, డిస్ట్రిబ్యూషన్ చీఫ్ ఇంజినీర్ సీహెచ్‌ఎస్ రెడ్డి, కాళేశ్వరం ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్‌చీఫ్ నల్ల వేంకటేశ్వర్లు హాజరై మాట్లాడారు. దేశానికి కీర్తి ప్రతిష్ఠలు తెచ్చిపెట్టిన ఎన్నో ప్రాజెక్టుల నిర్మాణంలో ఇంజినీర్ల కృషిని సభలో ప్రస్తావించారు. హైదరాబాద్ నగరాన్ని వరదల బారి నుంచి రక్షించడం కోసం మోక్షగుండం విశ్వేశ్వరయ్య చేసిన కృషి మరువలేనిదన్నారు. ద.మ రైల్వే ఇంజినీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డీకొండ పద్మనాభం, ప్రధానకార్యదర్శి వై.లోకేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

కంటోన్మెంట్ బోర్డులో..

కంటోన్మెంట్: దేశాభివృద్ధిలో ఇంజినీర్‌ల పాత్ర అత్యంత కీలకమని బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ అన్నారు. 'ఇంజినీర్స్ డే'ను పురస్కరించుని బోర్డు ఇంజనీరింగ్ అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. స్వతహాగా ఇంజినీర్ అయిన తమ ఉన్నతాధికారిని కలిసిన బోర్డు ఇంజనీర్లు ఆయనకూ శుభాకాంక్షలు తెలిపారు. సీఈఓ మాట్లాడుతూ.. దేశంలో ఏ అభివృద్ధికి కార్యక్రమం చేపట్టినా ఇంజనీర్‌ల పాత్ర లేకుండా ఆ పని పూర్తి కాదంటే అతిశయోక్తి లేదన్నారు. సుమారు 4 లక్షల జనాభా కలిగిన కంటోన్మెంట్‌లో అభివృద్ధి పనుల పర్యవేక్షణ భారమంతా కేవలం డజను మంది ఇంజనీర్లు మాత్రమే చూసుకోవడం అభినందనీయమన్నారు. గోపాలకృష్ణ దాస్, బాలకృష్ణ, ఉమాశంకర్, ఫణికుమార్, అసిస్టెంట్ ఇంజనీర్లు దినేశ్, కృష్ణ సాగర్, తరుణ్, జిష్ణు, ఆదిత్య నారాయణ, ఆశిష్ పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

కుమార్తెతో సహా తల్లి అదృశ్యం



త్రిష పాల్



శ్వేత పాల్

రాంగోపాల్‌పేట్: ఆరేళ్ల బాలికతో పాటు ఓ మహిళ అదృశ్యమైన ఘటన మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. వెస్ట్ బెంగాల్‌కు చెందిన మోనిశంకర్ పాల్ కొన్నేళ్ల క్రితం నగరానికి వచ్చి కండోజీబజార్‌లో ఉంటూ గోల్డ్‌స్మిత్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఆయనకు భార్య త్రిష పాల్ (26), కుమార్తె శ్వేతా పాల్(6) ఉన్నారు. ఇటీవల త్రిశపాల్ ఇన్‌స్టాగామ్ తదితర సోషల్ మీడియాలో వీడియోలు, చాటింగ్ ఇతరులతో ఫోన్లు మాట్లాడటం గమనించినభర్త పలు మార్లు మందలించినా ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ నెల 13న ఆయన తన పనిమీద వెళ్లగా కుమార్తెను తీసుకుని త్రిషపాల్ ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం ఇంటికి వచ్చిన మోనిశంకర్‌కు భార్య కుమార్తె కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మరో ఘటనలో యువతి..



గౌరీ

చిలకలగూడ: ఓ యువతి అదృశ్యమైన ఘటన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ సబిత వివరాల ప్రకారం.. మహారాష్ట్ర, చంద్రపూర్ జిల్లా, బీవార్‌పూర్ వార్డుకు చెందిన గౌరీ రాంగిరివార్ (21) నగరానికి వలసొచ్చి సీతాఫల్‌మండి అంబేడ్కర్ విగ్రహం సమీపంలో ఉంటోంది. ఈ నెల 13న ఉదయం బయటకు వెళ్లిన గౌరీ తిరిగి ఇంటికి చేరలేదు. పరిసర ప్రాంతాలతో పాటు స్వగ్రామంలో వాకాబు చేసినా ఫలితం లేకపోవడంతో బంధువు జ్యోతి పోలీసులకు ఫిర్యాదు చేసింది.



రైల్వేలో నూతన పెన్షన్ స్కీమ్‌కు వ్యతిరేకంగా ఉద్యమించాలి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాఘవయ్య

బన్సీలాల్‌పేట్: భారతీయ రైల్వేలో నూతన పెన్షన్ స్కీమ్‌ను వెంటనే ఉపసంహరించుకోవాలని దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ బోయిగూడ రైల్ కళారంగ్‌లో శుక్రవారం నిర్వహించిన సంఘ్ 111వ సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. నూతన పెన్షన్ స్కీమ్ రైల్వే ఉద్యోగులకు గుదిబండగా మారిందన్నారు. నూతన పెన్షన్ విధానంతో పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు తీరని అన్యాయం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సంఘ్ అధ్యక్షులు ప్రభాకర్, నాయకులు భరణి భానుప్రసాద్, రుద్రారెడ్డి, కేవీఆర్ ప్రసాద్, భుజంగరావు, షేక్ రవూఫ్ పాల్గొన్నారు.

వీసీ తీరును ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వీసీ ప్రొ.రవీందర్ వివిధ అంశాలపై అనుసరిస్తున్న తీరు పట్ల అధ్యాపకులు అసంతృప్తిని వ్యక్తం చేశారు. శుక్రవారం క్యాంపస్‌లోని సైన్స్ కాలేజీలో జరిగిన ఉస్మానియా యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్ (ఔటా) సర్వసభ్య సమావేశంలో వీసీ విధానాలను తూర్పారాబట్టారు. కంట్రీబ్యూటరీ పెన్షన్ స్కీమ్(సీపీఎస్), పీఆర్‌సీ బకాయిలు, ఇటీవల జరిగిన సీనియర్ ప్రొఫెసర్ల పదోన్నతుల్లో అవకతవకలు, ఓయూ భూముల కబ్జా తదితర అంశాలపై చర్చించారు. సమావేశంలో ప్రవేశ పెట్టిన తీర్మానాలను అధ్యాపకులు ఏకగ్రీవంగా ఆమోదించారు. ఆందోళన ద్వారా వీసీ ప్రొ.రవీందర్ నియంతృత్వ ధోరణులను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఔటా నాయకులు డాక్టర్ గంగాధర్, రాధాకృష్ణతో పాటు సీనియర్ ప్రొఫెసర్లు కిషన్, అప్పారావు పాల్గొన్నారు.

మెడికల్ షాపులో తనిఖీలు: కేసు నమోదు



డ్రగ్స్ అధికారులు దాడులు చేసిన షాపు

రాంగోపాల్‌పేట్: ఫిజిషియన్ శాంపిల్స్‌ను విక్రయిస్తున్న మెడికల్ షాపుపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు చేసిన ఘటన రాంగోపాల్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఈ నెల 12వ తేదీన పీజీరోడ్‌లోని సన్‌షైన్-కిమ్స్ ఆస్పత్రి పక్కనే షింఫోని మెడికల్ షాపును అమిత్ చౌహాన్ అనే వ్యక్తి నిర్వహిస్తున్నాడు. ఇందులో ఉచితంగా ఇచ్చే ఫిజిషియన్ శాంపిల్స్‌ను విక్రయిస్తున్నారనే ఫిర్యాదుతో డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ సింగ్ ఆధ్వర్యంలో అధికారులు దాడులు చేశారు. దాడుల సమయంలో అక్కడే ఉన్న అమిత్ చౌహాన్, రోహిత్ చౌహాన్ అధికారులను అడ్డగించి వాగ్వాదానికి దిగారు. పోలీసుల సహకారంతో వారు షాపులో తనిఖీలు చేయగా ఫిజిషియన్ శాంపిల్స్‌గా అందించాల్సిన 30 రకాల మందులు శాంపిల్స్‌ను విక్రయిస్తున్నట్లు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం అమిత్ చౌహాన్, రోహిత్ చౌహాన్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. డ్రగ్స్ అధికారులు షాపును సీజ్ చేసినప్పటికీ మళ్లీ తెరిచి కార్యకలాపాలు నిర్వహిస్తుండటం గమనార్హం.

స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు



తూముల కృష్ణ

అమీర్‌పేట: ఆర్థిక లావాదేవీల కారణంగా స్నేహితుడిని హత్య చేసిన వ్యక్తికి జీవిత ఖైదు శిక్ష పడింది. రహమత్‌నగర్‌కు చెందిన తూముల కృష్ణ (36) మధురానగర్‌లోని జీ–బ్లాక్‌లో పదేళ్లుగా కార్ల షెడ్డు నిర్వహిస్తున్నాడు. ఇందిరానగర్‌కు చెందిన వెంకటరాజం (32)తో కృష్ణకు ఐదేళ్లుగా పరిచయం ఉండటంతో డబ్బులు ఇచ్చుపుచ్చుకోవడం జరిగేది. గతంలో కృష్ణతో ఓ కారును కొనిపించగా నష్టం రావడంతో ఇద్దరి మధ్య మనస్పర్ధలు వచ్చాయి. కాగా వెంకటరాజంకు, తెలిసిన వ్యక్తుల వద్ద కృష్ణ రూ.1.40 లక్షలు అప్పుగా ఇప్పించాడు. తీసుకున్న అప్పు తిరిగి చెల్లించనప్పటికీ కృష్ణకు ఎలాంటి కమీషన్ ఇవ్వలేదు. ఈ విషయంలో ఇద్దరు పలుమార్లు ఘర్షణ పడ్డారు. ఈ నేపథ్యంలో కృష్ణ ఓ రోజు తన షెడ్డుకు వెంకటరాజంను పిలిపించుకుని తనకు రావాల్సిన డబ్బులు అడిగాడు. మాటామాట పెరగడంతో కృష్ణ ఆగ్రహంతో స్క్రూడ్రైవర్‌తో వెంకటరాజంను పొడవగా అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్ఆర్‌నగర్ పోలీసులు కృష్ణను అరెస్టు చేశారు. కేసు విచారణ అనంతరం నిందితుడికి 3వ అదనపు మెట్రోపాలిటన్ సెషన్ జడ్జి కె.కవిత జీవిత ఖైదుతో పాటు రూ.5 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.